PRGI No: TGBIL/25/A0946

విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA

DK MEDIA

OUR SERVICES

* NEWS PAPER
* NEWS CHANNEL
* DK GRAPHICS
* DK ADS & PROMOTIONS
* DK PRINTERS
* DK PUBLICATIONS

WE'RE HIRING REPORTERS

for more details: 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 85 శనివారం, అక్టోబర్ 24 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య

సమన్వయం పెంచాలి

- దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానం, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకుంటామని వెల్లడి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రకటన

హైదరాబాద్ : దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పర స్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచి ంచారు. హైదరాబాద్‌లోని 'ఇం టిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంట ర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు.

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి



న్యూ ఢిల్లీ : విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధానమంత్రి అన్నారు.

ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కీలక ఆదేశాలు

- హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం

హైదరాబాద్: హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హై దరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ

హైదరాబాద్, అక్టోబరు 23 : నక్సల్స్ సమస్య 1980లో ఉండేదని.. ఇందుకోసం గ్రేహౌండ్స్ ఏర్పాటు చేశామని.. ఈ విభాగానికి దేశవ్యాప్తంగా ప్రాముఖ్యం ఉందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. నక్సల్స్ సమస్య తగ్గిపోయిన తర్వాత గతంలో హైదరాబాద్‌లో బ్లాస్టులు జరిగాయని.. అప్పుడు అక్టోపస్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ ఏర్పాటైందని అన్నారు. రెండేళ్లలో 824 మంది లొంగిపోయారని.. 302 ఆయుధాలను అప్పగించారని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 36వ రైజింగ్ డే పరేడ్‌ను (శుక్రవారం) నిర్వహించారు. అమీన్‌పూర్‌లోని టీజీ ఎస్పీఎఫ్ సెక్యూరిటీ అకాడమీలో ఈ వేడుకలు జరిగాయి.

హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్

హైదరాబాద్: శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలు, రోడ్ల శుభ్రత వంటి పనులకు అందించేందుకు 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనికోసం నగర శివారులోని కోకాపేటలో ప్రత్యేకంగా ఒక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, అత్యంత విలువైన తాగునీటిని ఇతర అవసరాలకు వాడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ప్రణాళిక అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను సందర్శించి, శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు, ఏయే ప్రమాణాలు పాటిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ అభివృద్ధిలో ఎస్పీఎఫ్ పాత్ర కీలకం

కీలక సంస్థలకు ఎస్పీఎఫ్ ప్రత్యేక భద్రత కల్పించింది.. భద్రత వ్యవస్థ బలాన్ని ఆయుధాలతో కొలువలేం..

హైదరాబాద్, అక్టోబరు 23 : రాష్ట్ర అభివృద్ధిలో ఎస్పీఎఫ్ పాత్ర కీలక మని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానిం చారు. తెల ంగాణను సురక్షిత రాష్ట్రం గా తీర్చి దిద్దాలని సూచించారు. హై దరాబాద్‌లో తెలంగాణ స్పెషల్ ప్రొటె క్షన్ ఫోర్స్ 36వ రైజింగ్ డే పరేడ్‌ను (శుక్రవారం) నిర్వహించారు. అమీన్ పూర్‌లోని టీజీ ఎస్పీఎఫ్ సెక్యూరిటీ అకాడమీలో ఈ వేడుకలు జరిగాయి. ఈ పరేడ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, టీజీఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, హోం ప్రిన్సిపాల్ సెక్రటరీ శిఖా గోయల్ హాజరయ్యారు. 36వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. టీజీ ఎస్పీఎఫ్ సిబ్బంది క్రమశిక్షణ, సేవాస్ఫూర్తిని ప్రత్యక్షంగా చూస్తున్నానని, సంతోషంగా ఉందని తెలిపారు. 'ప్రభుత్వం ప్రజల భద్రతపై బాధ్యతగా వ్యవహరిస్తోంది. 30 సంవత్సరాల విశిష్ఠ ప్రయాణంలో టీజీ ఎస్పీఎఫ్ పాత్ర వెలకట్టలేనిది. కీలక సంస్థలకు ప్రత్యేక భద్రతను ఎస్పీఎఫ్ కల్పించింది. సచివాలయం, శాసనసభ హైకోర్టు, నాగార్జునసాగర్, ప్రధాన దేవాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద, కేంద్ర ప్రభుత్వ కీలక సంస్థల్లో సెక్యూరిటీగా ఉంది. మీ నినాదం ప్రగతికి రక్షణ.. భద్రత ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయి. ప్రతి అంశంలో మౌలిక అవసరం భద్రత, ప్రజల భద్రతే అభివృద్ధికి పునాది. జైపూర్, యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో భద్రత ఎస్పీఎఫ్‌దే.. మీ కృషి మరువలేనిది. విద్యుత్ కేంద్రాలతో వెలుగులు వస్తాయి... వెలుగులు కాపాడే బాధ్యత ఎస్పీఎఫ్‌దే. 35 సంవత్సరాల్లో భద్రతలో చాలా మార్పులు వచ్చాయి' అని భట్టి విక్రమార్క తెలిపారు.

సరాక ఫ్యాక్టరీ ప్రమాదం.. కార్మికుల మృతికి ?

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 23 : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ కారణంగా ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుదర్శన్, బాలాజీ అనే ఇద్దరు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు. ఈ ప్రమాదంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ శ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలిపా రు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిం చాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమల్లో ఇలాంటి ఘటను జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారుకార్మికుల ప్రాణాలతో చెలగాటం..నాడు సిగాచి.. నేడు సరాక పరిశ్రమలో ప్రమాదాలు జరిగాయని హరీశ్‌రావు వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య

రహస్య ఒప్పందం

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్న మహేశ్ గౌడ్
- పార్లమెంట్‌లో ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శ
- కాళేశ్వరంపై కిషన్ రెడ్డి సీబీఐ విచారణ హామీ ఏమైందన్న మహేశ్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం నిజామాబాద్ అర్బన్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని మహేశ్ గౌడ్ విమర్శిం చారు. త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముందుగా బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించిన తర్వాత, బీఆర్ఎస్ కేవలం నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా నిలదీశారు.

కూటమిలో సీట్ల సర్దు'పాట్లు'

- చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమైన పవన్‌కల్యాణ్, మాధవ్

అమరావతి: స్థానిక పోరులో సీట్ల లెక్కలు కూటమి నేతలకు అసలు పరీక్షగా మారాయి. ఆశావహుల , రెబల్స్‌బెడద,మిత్రపక్షాలడిమాండ్ల మధ్య సీట్లసర్దుబాటుపైచంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ కసరత్తు చేస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో ఎవరికి ఎంత వాటా? స్థానిక బలాబలాల ప్రాతిపదికన పంపకాలుఎలాఉండబోతున్నాయి? అన్నది ఇప్పుడు కూటమి రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పవన్‌తో భేటీ తర్వాత చంద్రబాబు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తోనూ ప్రత్యేకంగా సమావేశమవడంతో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసిన వేళ, కూటమి పార్టీల మధ్య సమన్వయమే కీలకంగా మారింది.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే

రోజులు వస్తున్నాయి

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం

హైదరాబాద్: దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు.

శనివారం,
అక్టోబర్ 24, 2026
PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరిక
- సఫాయి బస్తి ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- 49 వాహనాలపై జరిమానాలు
- 87 మద్యం సీసాలు స్వాధీనం

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట ప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు ఎన్డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు.. ఎక్కడికి వెళుతున్నారు..అనే విషయాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పేకాట జూదం మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ యూపీఐ మోసాలు నకిలీ ఫోన్ కాల్స్ అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ప్రాంతంలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయండి

- రద్దు చేసిన రైళ్లను తిరిగి తక్షణమే నడిపించాలి
- రైల్వే స్టేషన్ సెంటర్ టు గొల్లగూడెం రోడ్ వెడల్పుకు తక్షణమే స్థలాన్ని కేటాయించాలి
- అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి- డిఆర్ఎం గోపాలకృష్ణకు విజ్ఞాపన పత్రం

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): తిరుపతి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని రద్దు చేసిన కొల్హాపూర్ కాజీపేట డోర్నకల్ రైళ్లను తిరిగి తక్షణమే నడిపించాలని ఎంపీ రఘురాం రెడ్డి కృషితో మంజూరైన రైల్వే స్టేషన్ సెంటర్ టు గొల్లగూడెం రోడ్ వెడల్పుకు తక్షణమే స్థలాన్ని కేటాయించడం తోపాటుగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు శుక్రవారం డిఆర్ఎం గోపాలకృష్ణకు వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం రైల్వే అభివృద్ధి పనులు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి ప్రజలకు భక్తులకుఅన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని గతంలో రద్దు చేసిన కొలహపూర్ కాజీపేట డోర్నకల్ రైళ్ళను తిరిగి నడిపించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన రైల్వే డి ఆర్ ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ తప్పనిసరిగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటుగా రద్దు చేసిన రైళ్లతోపాటు తిరుపతి కి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైల్వే అధికారులతో కలిసి కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్తగూడెం అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాసరావు, నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, సత్యనారాయణ అగ్రవాల్, అనూప్ ఖండేల్వాల్, వందనపు రాము, బిచ్చు అగ్రవాల్, గోపాల్ పంచార్య, సలి దండి రవి, వందనపు సూర్య ప్రకాష్ రావు, రామ్ కుమార్, బండారి నాగేశ్వరరావు, చిట్టి మల్ల చంద్రశేఖరాచారి, కొత్తగూడెంరైల్వే ఏరియా ఏవో కులకర్ణి సుభాష్, ఏరియా ఇన్స్పెక్టర్ పాషా, రైల్వేసీఐ కృష్ణ, ఎస్సై నాగార్జున రెడ్డి, మేనేజర్ విశ్వనాథ్, రైల్వే ట్రాఫిక్ మాజీ ఇన్స్పెక్టర్ ఆర్.చలం, రైల్వే అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు న్యాక్ బంపర్ ఆఫర్

- నాలుగు సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ..
శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు
మూడు నెలల పాటు శిక్షణ.. భోజనం, వసతి ఉచితం
- అర్హత పదో తరగతి నుంచి.. 18--35 ఏళ్ల యువతకు అవకాశం
- నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం పిలుపు.. చుట్టుపక్కల గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్: గ్రామీణ నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చారు. నిజా మాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని న్యాక్ కేంద్రంలో నాలుగు విభాగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నందిపేట్, డొంకేశ్వర్ మండలాలతో పాటు పరిసర గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలని నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం కోరారు.

నాలుగు కోర్సుల్లో శిక్షణ

ల్యాండ్ సర్వేయర్, కన్స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, పెయింటింగ్ అండ్ డెకరేషన్ కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారు. ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత లేదా డిప్లొమా, ఐటీఐ అర్హత ఉండాలి. కన్స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్, పెయింటింగ్ అండ్ డెకరేషన్ కోర్సులకు పదో తంగతి ఉత్తీర్ణత లేదా ఐటీఐ అర్హత అవసరం. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.భోజనం, వసతితోపాటు సాంకేతిక శిక్షణశిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు టీ-షర్ట్, హెల్మెట్, భద్రతా షూస్ అందించనున్నారు. సాంకేతిక నైపుణ్యాలకు అదనంగా స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణ కూడా ఇవ్వను న్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి న్యాక్ సర్టిఫికెట్‌తోపాటు ఎన్ఎస్‌డీసీ సంబంధిత సర్టిఫికెట్ అందజేస్తారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాలు ఇవేఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో లు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ ప్రతులను సిద్ధం చేసుకోవాలి. వివరాలకు సంప్రదించండిన్యాక్ నిజామాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ 9296507557 నంబర్‌తోపాటు 97045 87655, 9959773079, 9866350200 నంబర్లను సంప్రదించి శిక్షణ, నమోదు వివరాలు తెలుసుకోవచ్చు. యువతకు సర్పంచ్ పిలుపు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, శిక్షణ ద్వారా ఉపాధి పొందే దిశగా ముందడుగు వేయాలని నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం సూచించారు. ముఖ్యంగా నందిపేట్, డొంకేశ్వర్ మండలాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు కేటీఆర్

హైదరాబాద్ : గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. అడ్డమైన మాటలు, అడ్డమైన ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని మండిపడ్డారు. పరిపాలన చేతకాక ప్రజలకు ఏమీ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావంపై 10 నెలల ముందే ప్రభుత్వాన్ని అలర్ట్ చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.పక్క రాష్ట్రాలు, దిగువ రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రాజెక్టులను నింపుకున్నాయి.
తెలివిలేని రేవంత్ రెడ్డి..తెలివిలేని రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టులను నింపలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తాను చేసిన అబద్ధాలు ప్రజల ముందు తేలిపోతాయని రేవంత్ రెడ్డి కుట్ర చేశారు. మేడిగడ్డ కూలిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వాళ్లే మేడిగడ్డను కూల్చారన్నారు. రాహుల్ గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డ కూలిపోయిందంటూ అబద్ధాలు చెప్పించారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను ప్రజలు కేటీఆర్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- నందిపేటలో ఐదుగురికి రూ.1.34 లక్షల ఆర్థిక సాయం

నందిపేట్, అక్టోబర్ 23: ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని నందిపేట్ మండల కేంద్రంలోని సుభాష్ కాలనీ, రామ్‌నగర్‌కు చెందిన ఐదుగురు బాధితులకు కాంగ్రెస్ నాయకులు చెక్కుల రూపంలో అందజేశారు.ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధితులకు మొత్తం రూ.1,34,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పోతుల రాజుకు రూ.52,000, పెంట రామ్మోహన్‌కు రూ.14,000, కొత్తూరు చిన్న సాయన్నకు రూ.28,000, ఉమ్మెడ చిన్నక్కకు రూ.22,000తో పాటు మరో బాధితుడికి రూ.18,500 విలువైన చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూడ వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాంతం చిన్నయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి, నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ద్యావతి లింగం, మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు యూసుఫ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అక్బర్, ఖాదీర్, భూమన్న మల్లయ్య, ఖాజా వలి, జమీల్, మన్సూర్ భూమేష్, ఫిరోజ్, డాక్టర్ హైమద్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.
బాధిత కుటుంబాలకు సహాయం అందేలా సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అవసరమైన వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- గౌరవ వేతనం పెంచాలి.. కమీషన్‌ను సవరించాలి
- డీఆర్ఓకు వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్ల సంఘం

నిజామాబాద్, అక్టోబర్ 23: జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారికి (డీఆర్ఓ) వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అతిలమ నాగేష్, కార్యదర్శి చిట్టి పార్థసారధి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమకు అందుతున్న గౌరవ వేతనం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రేషన్ డీలర్ల కమీషన్‌ను కూడా అందుకు అనుగుణంగా పెంచాలని కోరారు.ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ సరుకుల దిగుమతి, హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి రేషన్ దుకాణానికి సరుకులను పంపించే సమయంలో ఖచ్చితమైన తూకం పాటించి, నిర్ణీత పరిమాణంలో సరుకులు సరఫరా చేయాలని కోరారు.రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అసోసియేషన్

రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు కృషి చేస్తా జెస్సు అనిల్ కుమార్

- రెడ్‌క్రాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియామకం..
ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఘన సన్మానం

ఆర్మూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఎన్నికల్లో విజయం సాధించి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన ఆర్మూర్ పట్టణ ప్రముఖ న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్‌ను ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ చందర్ అధ్యక్షతన బార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అనిల్ కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనిల్ కుమార్ నాయకత్వంలో సొసైటీ సభ్యత్వాలను పెంచడంతోపాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై అవగాహన కల్పించడంతోపాటు యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. రక్తదానం, అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించి, మానవతా సేవల్లో రెడ్‌క్రాస్ సొసైటీ మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. తనను సన్మానించిన ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌తోపాటు సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీధర్, కిష్టయ్య, జక్కుల శ్రీధర్, జగన్, మురళి, తెడ్డు నర్సయ్య, పవన్, తాజొద్దిన్, ఖాందేశ్ సంగీత, బోచ్‌కర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

బాంబులపై బతుకులు
ఎప్పుడు పేలుతాయో తెలియని గ్యాస్ ముప్పు

- నిజామాబాద్ జిల్లాలో యథేచ్ఛగా అక్రమ ఎల్పీజీ రీఫిల్లింగ్ దందా
- జనావాసాల మధ్యే ప్రమాదకరంగా గ్యాస్ బదిలీ.. భద్రతా నిబంధనలు బేఖాతరు
- ఆర్మూర్, బోధన్, నందిపేట్, భీమ్‌గల్ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలపై ఆరోపణలు
- 2 కేజీల సిలిండర్‌కు రూ.250.. 4 కేజీలకు రూ.450 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం
- అధికారుల పర్యవేక్షణపై విమర్శలు.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

నిజామాబాద్: జనావాసాల మధ్య అక్రమ ఎల్పీజీ గ్యాస్ రీఫిల్లింగ్ కార్యకలాపాలు ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆర్మూర్, బోధన్, నందిపేట్, భీమ్‌గల్ తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చిన్న సిలిండర్లలోకి గ్యాస్ బదిలీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదకరమైన పరికరాలతో, కనీస భద్రతా జాగ్రత్తలు లేకుండా నివాస ప్రాంతాల్లోనే ఈ కార్య కలాపాలు సాగుతున్నట్లు సమాచారం. సం బంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తనిఖీలు చేపట్టాలని, అక్రమ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జనావాసాల్లోనే గ్యాస్ బదిలీ.. పొంచి ఉన్న ప్రమాదం

గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలోకి గ్యాస్‌ను బదిలీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఎలక్ట్రిక్ మోటార్లు, పైపులు తదితర పరికరాలను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి కార్యకలాపాలు నివాస గృహాలు, వ్యాపార సముదాయాల సమీపంలో కొనసాగితే చిన్నపాటి గ్యాస్ లీకేజీ లేదా ఇతర సాంకేతిక లోపం కారణంగా అగ్నిప్రమాదం సంభవించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఇరుకైన వీధులు, రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలు ఉంటే ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

చిన్న సిలిండర్లకు అధిక ధరలు?

అక్రమ రీఫిల్లింగ్ వ్యవహారంలో వినియోగదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రెండు కేజీల సిలిండర్‌లో గ్యాస్ నింపేందుకు రూ.250, నాలుగు కేజీల సిలిండర్‌కు రూ.450 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. అత్యవసర అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ధరలు, అక్రమ కార్యకలాపాల విస్తృతి, వాటి వెనుక ఉన్న వ్యక్తుల వివరాలను సంబంధిత అధికారులు విచారించి నిర్ధారించాల్సి ఉంది.

భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా?

గ్యాస్ బదిలీ ప్రక్రియలో తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోతే ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంది. గ్యాస్ లీకేజీ, విద్యుత్ స్పార్క్ వంటి కారణాలు అగ్నిప్రమాదానికి దారితీయవచ్చు. అందువల్ల అనుమతులు, నిల్వలు, ఉపయోగిస్తున్న పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజల నివాసాల మధ్య ఇలాంటి కార్యకలాపాలు

సాగుతున్నాయనే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయడం సరికాదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

అధికారుల తనిఖీలు ఎక్కడ?

పౌరసరఫరాల శాఖ, సంబంధిత చమురు సంస్థలు, అగ్నిమాపక శాఖ, తూనికలు-కొలతల శాఖలు తమ పరిధిలోని నిబంధనల ప్రకారం సమన్వయంతో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా గ్యాస్

బదిలీ చేస్తున్న కేంద్రాలను గుర్తించి, ఉల్లంఘనలను నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అనధికార కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగాక స్పందిస్తారా?

“మా ఇళ్ల మధ్యే సిలిండర్ల నుంచి గ్యాస్ నింపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే మా ప్రాణాలు, ఆస్తుల పరిస్థితి ఏమిటి? ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద కేంద్రాలను తనిఖీ చేసి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి” అని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. అక్రమ రీఫిల్లింగ్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయడంతో పాటు, ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబాలను గ్రామ బహిష్కరణ
చేసిన వీడిసిపై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్ కు వినతి.



కామారెడ్డి జిల్లా , విశాలజ్యోతి: కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం తిర్మన్ పల్లి గ్రామంలో కల్లు గీత కార్మిక కుటుంబాలను గ్రామ సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామ కమిటీ పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లింగా గౌడ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సైదగౌని వెంకట్ గౌడ్ జైగౌడ జిల్లా అద్యక్షులు మురళి గౌడ్ డిమాండ్ చేశారు ఈరోజు సదాశివ నగర్ మండలం తహసిల్దార్ కి మెమోరండం ఇవ్వండి జరిగింది అనంతరం మాట్లాడుతూ తిర్మన్ పల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం గౌడ కులస్తులు ను గ్రామ కమిటీ డబ్బులు డిమాండ్ చేశారు గౌడ కులస్తులు డబ్బులు ఇవ్వకపోతే గ్రామ బహిష్కరణ చేసారు గౌడ కులస్తులు తో ఎవ్వరూ మాట్లాడవద్దు ఎవరు వస్తువులు ఇవ్వద్దు ఇస్తే 5 వేల రూపాయలు జరిమానా విధిస్తామని గ్రామంలో చాటింపు వేయించారు కావున సమాంతరంగా ప్రభుత్వం నడుపుతున్న గ్రామ కమిటీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ విషయం పై జిల్లా కలెక్టర్ కి జిల్లా ఎస్పీ కి కూడా వినతి పత్రాలు ఇస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో నాయకులు రామా గౌడ్ తిర్మమన్ పల్లి గీత కార్మికులు స్వామి గౌడ్, మైసాగౌడ్, మల్లా గౌడ్, శ్రావణ్ గౌడ్, లక్షణ్ గౌడ్ చిన్న మైసా గౌడ్, మహేష్ గౌడ్, బాలా గౌడ్ మండల గౌడ సంఘం నాయకులు సాయి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

25న బాల సాహితీవేత్తల కార్యశాల

- తెలంగాణ సాహిత్య అకాడమీ, ట్రస్మా సౌజన్యంతో..
- 'బడి-పిల్లలు, సృజనాత్మక రచన-గ్రంథాలయాలు' అనే అంశంపై నిర్వహణ.

తొర్రూరు, విశాలజ్యోతి: తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో ట్రస్మా సహకారంతో రేపు అనగా 25 అక్టోబర్ 2026 ఆదివారం నాడు “బాల సాహితీవేత్తల కార్యశాల”ను హైదరాబాద్ లో నిర్వహించడం జరుగుతుందని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొనికెన కుమారస్వామి తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో శుక్రవారం నాడు దొనికెన ఒక ప్రకటన విడుదలజేస్తూ ఈ కార్యక్రమం ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్, వీధి నెంబర్ 13, హిమాయత్ నగర్, హైదరాబాద్ వేదికగా ఉదయం గం. 9-45 ని.ల నుండి సాయంత్రం గం. 4-30 ని.ల వరకు “బడి-పిల్లలు, సృజనాత్మక రచన, ఉపాధ్యాయులు-గ్రంథాలయాలు” అనే అంశంపై డా. మాడభూషి రంగాచార్య స్మారక సంఘం వారి ఆధ్వర్యంలో ఒకరోజు కార్యశాల నిర్వహించడం జరుగుతుందని దొనికెన చెప్పారు. ఈ కార్యశాలలో ప్రముఖ సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, డా. నామోజు బాలాచారి, డా. పత్తిపాక మోహన్, సద్దుల మధుసూదన్, శ్రీమతి పైడిమర్రి గిరిజ, డా. వి.ఆర్.శర్మ, డా. సమ్మెట విజయ, డా. చేగోని రవికుమార్, శ్రీమతి జొన్నలగడ్డ శ్యామల, చొక్కాపు వెంకటరమణ, డా. అమరవాది నీరజ, మణికొండ వేదకుమార్, శ్రీమతి శీలా సుభద్రా దేవి, మాడభూషి లలితాదేవి లతో పాటుగా ప్రముఖ బాల సాహితీవేత్తలు ఎందరో పాల్గొంటారని దొనికెన వివరించారు. పాఠశాల స్థాయిలోనే బాలబాలికలకు భాషలపై, సాహిత్యంపై అభిరుచిని పెంచి భవిష్యత్తులో వారిని ఒక గొప్ప మంచి రచయితలుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నారని, సాహిత్యంలోని పలు ప్రక్రియలపై లోతుగా చర్చించడం జరుగుతుందని, రకరకాల మెళకువలు నేర్పించడం, వివిధ సులభమైన సూచనలు ఇవ్వడం జరుగుతుందని, సాహిత్యపరమైన విషయాలెన్నో నేర్చుకునే అవకాశం ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్లల్లోని ఔత్సాహిక బాలలు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా భాషా ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కూడా ఈ దిశగా పిల్లలను ప్రోత్సహించాలని దొనికెన కోరారు. ఈ కార్యశాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే పిల్లలకు, ఉపాధ్యాయులకు అన్ని రకాల తగిన ఏర్పాట్లు కూడా చేయడం జరిగినందున అధిక సంఖ్యలో పిల్లలు, ఉపాధ్యాయులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కుమారస్వామి కోరారు

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లపై సీపీ సమీక్ష

- క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- నవంబర్‌లో నిజామాబాద్‌లో ముగింపు కార్యక్రమం.. పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలు

నిజామాబాద్, అక్టోబర్ 23: నవంబర్ 2026లో నిజామాబాద్‌లో నిర్వహించనున్న 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో క్రీడా పోటీల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. క్రీడా మైదానాలు, ట్రాక్‌ల సిద్ధీకరణతోపాటు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. క్రీడాకారుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తూ వైద్య సిబ్బందిని, ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సీపీ సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలు

5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భాగంగా జన్నంపేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్, అలీసాగర్, నాగారం గ్రౌండ్, కాలూరు రోడ్డు, ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్, ముగుపల్ ఆర్చరీ అకాడమీ తదితర ప్రాంతాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన మైదానాలు, క్రీడా పరికరాలు, ఇతర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.

అధికారులు, క్రీడా ప్రతినిధులు హాజరు

ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ, ఏఆర్, ఐటీ, సీసీఆర్‌బీ, ట్రాఫిక్ విభాగాలకు చెందిన ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, కృష్ణ, నరేందర్, గురు నాయుడు, మస్తాన్ అలీ, డీవైఎస్‌వో బి. పవన్ కుమార్, ఆర్చరీ కోచ్ రవీందర్, స్విమ్మింగ్ కోచ్ మహిపాల్‌రెడ్డి, అథ్లెటిక్స్ సెక్రటరీ రాజా గౌడ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విజయ్ కాంత్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై దాన్యం, మక్కలు,సోయలు పోయకూడదు

- వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం.
- సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు

కామారెడ్డి జిల్లా, విశాలజ్యోతి: కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్ర ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేశారు ఇటీవల కొంతమంది రహదారిపై వడ్లు, మక్కలు, ఇతర ధాన్యాన్ని ఆరబెడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది చట్టరీత్యా నేరం మరియు ప్రమాదకరం. అని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ అన్నారు ఈ సందర్భంగా సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ రోడ్డుపై ధాన్యం పోయడం వల్ల వాహనాలు అదుపుతప్పి తీవ్ర రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనివల్ల ప్రాణ నష్టం జరిగితే దానికి పూర్తి బాధ్యులు ధాన్యం ఆరబెట్టిన వారే.కావున ఇందుమూలంగా హెచ్చరించడం ఏమనగా ఇకపై ఎవరూ ప్రధాన రహదారిపై, గ్రామ రహదారులపై ధాన్యం ఆరబెట్టరాదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 283 (రహదారిలో ప్రమాదం కలిగించడం) ప్రకారం కేసు నమోదు చేసి, జరిమానా మరియు చట్టపరమైన చర్యలు తీసుకోబడును. దీనివల్ల జరిగే ఏ ప్రమాదానికైనా ధాన్యం యజమానే బాధ్యత వహించాల్సి ఉంటుందని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులం 11 వ రోజు నిరవధిక సమ్మె

- సంపూర్ణ సంఘీభావం తెలిపిన ఏఐటియుసి.

యాదాద్రి జిల్లా, విశాలజ్యోతి: నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 20 సంవత్సరాల నుండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వారికి ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున కలెక్టరేట్ కార్యాలయం ముందట యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి సమావేశం యాదాద్రి జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎం.డి ఇమ్రాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు అమలు చేయకుండా అతి తక్కువ జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. డ్యూటీ చార్ట్ ప్రకారం విధులు చేయించకుండా అనేక రకాల క్రింది స్థాయి పనులను వారిపై రుద్దుతూ పని భారాన్ని పెంచటం అన్యాయమని ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి యాదవ్ మాట్లాడుతూ ఇతర ఏడు రాష్ట్రాలలో రెగ్యులరైజేషన్ చేసిన మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎన్హెచ్ఎం ఉద్యోగులందరినీ బేసరతుగా రెగ్యులరైజేషన్ చేయాలని, ఐదు శాతం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు శాతం వేతనం ఇవ్వట్లేదని నూకల అంజి యాదవ్ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభన్ బాబు, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు నరసింహ, మరియు అన్ని క్యాడర్స్ ఉద్యోగులు సుమారుగా 106 మంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికైన బాల్ రెడ్డి

చేవెళ్ల అక్టోబర్ 23 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి శ్రీపాల్.

చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా తంగడపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్, సీనియర్ నాయకులు తంగడపల్లి బాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాల్ రెడ్డి గతంలో తంగడపల్లి ఉపసర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారం, పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ముందున్నారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీలకంగా ఉంటూ, పార్టీ కష్టకాలంలో కూడా జెండా మోసిన నాయకుడు బాల్ రెడ్డి అని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండలాన్ని మరింత బలోపేతం చేయడానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బాల్ రెడ్డి నాయకత్వం ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. బాల్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల కార్యదర్శిగా ఎన్నుకున్న చేవెళ్ల నియోజకవర్గ మండల కాంగ్రెస్ నాయకత్వానికి, తంగడపల్లి గ్రామ ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు అంకితభావంతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల కాంగ్రెస్ నాయకులు, తంగడపల్లి మడికట్టు గ్రామ పెద్దలు, గ్రామ చిన్నలు యువకులు కార్యకర్తలు. అభినందనలు తెలిపారు

అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన ఎండిఆర్ ఫౌండేషన్

పటాన్చెరు అక్టోబర్ 23. (విశాలజ్యోతి) పటాన్‌చెరు బి హెచ్ ఈ ఎల్ ఎక్స్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని అనాథ మృతదేహానికి ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఎం డి ఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్ అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంతో పాటు, అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించడం తమ సామాజిక బాధ్యతగా ఎం డి ఆర్ ఫౌండేషన్ కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

కేయూ హాస్టల్ ఖజానాకు గండి

- రూ.80 వేలకుపైగా ప్రయాణ భత్యం డ్రా చేశారన్న ఆరోపణలు....
- ఉత్తర్వులు ఆగస్టు 21న జారీ అయితే..
- ఫిబ్రవరి నుంచే చెల్లింపులు ఎలా?.....
- హాస్టల్ తనిఖీల పేరుతో పేద విద్యార్థుల సొమ్ముకు గండి.
- విద్యార్థి సంఘాల ఆగ్రహం....

కేయూ క్యాంపస్, విశాలజ్యోతి: కాకతీయ విశ్వవిద్యాలయంలో హాస్టళ్ల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలపై మరో వివాదం తెరపైకి వచ్చింది. యూనివర్సిటీ మహిళా హాస్టల్స్ డైరెక్టర్‌కు నెలకు రూ.6,000 చొప్పున ప్రయాణ/రవాణా భత్యం మంజూరు చేస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం 21 ఆగస్టు 2026న ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, ఆ ఉత్తర్వులకు ముందే హాస్టల్ డైరెక్టర్లకు ఇదే మొత్తాన్ని చెల్లించారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఉత్తర్వుల్లో పేర్కొన్న తేదీకి ముందుగా చెల్లింపులు జరిగితే వాటికి ఏ నిబంధన, ఏ అధికారిక అనుమతి ప్రాతిపదికగా ఉందో యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆగస్టు 21న ఉత్తర్వులు.. ఫిబ్రవరి నుంచే చెల్లింపులా?..

కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయం 21-08-2026 తేదీన జారీ చేసిన ఉత్తర్వుల్లో, యూనివర్సిటీ మహిళా హాస్టల్స్ డైరెక్టర్ డా. కె. సుమలతకు హాస్టళ్లను తనిఖీ చేయడం, అధికారిక విధుల నిమిత్తం ప్రయాణించడం మరియు రవాణా ఖర్చులను భరించడం కోసం నెలకు రూ.6,000/- వాహన/ప్రయాణ భత్యం మంజూరు చేసినట్లు స్పష్టంగా పేర్కొంది. అంతేకాకుండా, ఈ చెల్లింపులు యూనివర్సిటీ హాస్టల్స్‌కు అందుబాటులో ఉన్న నిధుల నుంచి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఉత్తర్వులు ఆగస్టు 21న జారీ కాగా, ఫిబ్రవరి 2026 నుంచే హాస్టల్ డైరెక్టర్లకు నెలకు రూ.6,000 చొప్పున చెల్లింపులు జరిగినట్లు హాస్టల్ ఆర్థిక లావాదేవీలపై విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. డా. శ్రీనివాస్, డా. సుమలతలకు ఈ విధంగా మొత్తాలు చెల్లించడంతో కలిపి సుమారు రూ.80 వేల మేరకు నిధులు డ్రా/బదిలీ అయినట్లు వారు పేర్కొంటున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది---ఆగస్టు 21న ఉత్తర్వులు జారీ చేసినట్లయితే, ఆ ఉత్తర్వులలోని భత్యాన్ని ఫిబ్రవరి నుంచే ఎలా చెల్లించారు? ఉత్తర్వులకు పూర్వ తేదీ నుంచి వర్తింపజేసే ప్రత్యేక అనుమతి ఏదైనా ఉందా? ఉంటే ఆ అనుమతి ఎక్కడ ఉంది? ఆర్థిక శాఖ, ఆడిట్ విభాగం దానిని ఏ ప్రాతిపదికన ఆమోదించింది? అనే ప్రశ్నలకు యూనివర్సిటీ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

ఉత్తర్వుల్లో లేని తేదీ నుంచి చెల్లింపులు ఎలా?...

21-08-2026 ఉత్తర్వులో నెలకు రూ.6,000 భత్యం మంజూరు చేసినట్లు ఉన్నప్పటికీ, ఫిబ్రవరి 2026 నుంచి ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ఆ ఉత్తర్వులో ఎలాంటి స్పష్టమైన ఆదేశం కనిపించదని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. అయితే ఉత్తర్వులకు ముందు తేదీ నుంచి చెల్లింపులు జరిగి ఉంటే, అది సాధారణ చెల్లింపా? లేక ముందస్తు అనుమతితో చేసిన చెల్లింపా? లేక ఉత్తర్వులను వెనుకటి తేదీ నుంచి అమలు చేసినట్లా? అనే అంశాలపై సమగ్ర ఆర్థిక ఆడిట్ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

ధృతరాష్ట్ర పాత్రలో ఆడిటింగ్ అధికారులు?...

హాస్టల్ కార్యాలయంలో ఏదైనా బిల్లు చెల్లించాలంటే సాధారణంగా సంబంధిత బిల్లును యూనివర్సిటీ ఆడిట్/అకౌంట్స్ విభాగం పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే పాస్ చేయాల్సి ఉంటుందని విద్యార్థి సంఘాలు గుర్తుచేస్తున్నాయి. అలాంటి వ్యవస్థ ఉన్నప్పుడు, ఉత్తర్వుల తేదీ, చెల్లింపుల తేదీ, బిల్లుల తేదీ, ఆమోద తేదీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఆడిట్ అధికారులు పరిశీలించలేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఉత్తర్వు లు ఆగస్టు 21న జారీ కాగా, అంతకుముందు నెలలకు సంబంధించిన భత్య బిల్లులు పాస్ చేసి ఉంటే, వాటిని ఎవరు ఆమోదించారు? ఏ నిబంధన ఆధారంగా ఆమోదించారు? సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నారా అనే అంశాలను ప్రజలకు వెల్లడించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. "నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపు జరిగితే దానిని ఆపాల్సిన బాధ్యత ఆడిట్ అధికారులదే. కానీ చెల్లింపులు జరిగి ఉంటే, ఆడిట్ వ్యవస్థ ఏమి పరిశీలించింది?" అని వారు నిలదీస్తున్నారు.

హాస్టల్ తనిఖీల పేరుతో విద్యార్థుల సొమ్మా?...

కాకతీయ విశ్వవిద్యాలయంలో హాస్టల్ డైరెక్టర్లకు గతంలో గౌరవ వేతనం రూపంలో నెలకు సుమారు రూ.1,000 చెల్లించే విధానం కొనసాగిందని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుత పరిపాలనలో హాస్టల్ డైరెక్టర్లకు నెలకు రూ.6,000 ప్రయాణ/వాహన భత్యం మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారిందని పేర్కొంటున్నాయి. హాస్టళ్లలో తాగునీరు, పారిశుధ్యం, భోజనం, మెస్ నాణ్యత, మరమ్మతులు, విద్యార్థుల భద్రత తదితర సమస్యలు పరిష్కారం కాకుండా కొనసాగుతున్న సమయంలో, హాస్టల్ తనిఖీల పేరుతో అదనపు భత్యాలు చెల్లించడం ఎంతవరకు సమంజసం? అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. హాస్టల్ డైరెక్టర్లు విధిగా హాస్టళ్లను సందర్శించి, సమస్యలను పరిష్కరించి, తనిఖీ నివేదికలను సమర్పిస్తున్నట్లయితే ఆ నివేదికలు, పర్యటన వివరాలు, సందర్శన తేదీలు, ప్రయాణ వివరాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు. హాస్టళ్లకు వెళ్లిన తేదీలు, సందర్శించిన హాస్టళ్ల వివరాలు, తనిఖీ నివేదికలు, ప్రయాణ వివరాలు లేకుండానే రవాణా భత్యం చెల్లించి ఉంటే అది మరింత తీవ్రమైన ఆర్థిక ప్రశ్నగా మారుతుందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

ఒకే విశ్వవిద్యాలయం.. రెండు రకాల నిబంధనలా?...

యూనివర్సిటీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందినవారే. విద్యార్థులు చెల్లించే హాస్టల్ ఫీజులు, మెస్ చార్జీలు, ఇతర వసూళ్లతో నడిచే హాస్టల్ నిధులను అత్యంత జాగ్రత్తగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అలాంటి నిధుల నుంచి అధికారులకు భత్యాలు చెల్లించేటప్పుడు నిబంధనలు, తేదీలు, అనుమతులు, విధి నిర్వహణకు సంబంధించిన ఆధారాలు స్పష్టంగా ఉండాల్సిందే అని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

సమగ్ర విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్....

ఈ వ్యవహారంపై కాకతీయ విశ్వవిద్యాలయం వెంటనే స్వతంత్ర ఆర్థిక విచారణ/ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

1. 21-08-2026 ఉత్తర్వులకు ముందు ఫిబ్రవరి 2026 నుంచి రూ.6,000 చొప్పున చెల్లింపులు జరిగాయా?
2. జరిగితే వాటికి ఏ ఉత్తర్వు లేదా అనుమతి ప్రాతిపదిక?
3. చెల్లింపులకు సంబంధించిన బిల్లులను ఎవరు తయారు చేశారు?
4. బిల్లులను ఏ ఆడిట్ అధికారి పరిశీలించి పాస్ చేశారు?
5. హాస్టల్ నిధుల నుంచి ఎంత మొత్తం చెల్లించబడింది?
6. డైరెక్టర్లు తమ వ్యక్తిగత ఖాతాలకు ఎప్పుడు, ఎంత మొత్తాన్ని బదిలీ చేసుకున్నారు?
7. భత్యం పొందిన ప్రతి నెలకు సంబంధించిన హాస్టల్ తనిఖీ/పర్యటన రికార్డులు ఉన్నాయా?
8. ఉత్తర్వుల్లో పేర్కొన్న తేదీకి ముందు కాలానికి భత్యం చెల్లించేందుకు ప్రత్యేక అనుమతి ఏదైనా ఉందా?
9. నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటారా?
10. అదనంగా చెల్లించిన మొత్తాన్ని హాస్టల్ ఖజానాకు తిరిగి జమ చేయిస్తారా?

"హాస్టల్ ఖజానా ప్రజల సొమ్ము.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు..."

విద్యార్థుల నుంచి వసూలయ్యే ప్రతి రూపాయి హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికే వినియోగించాల్సి ఉంటుందని విద్యార్థి సంఘాలు స్పష్టం చేశాయి. "ఉత్తర్వుల తేదీకి ముందే భత్యాలు చెల్లించి ఉంటే, అది కేవలం లెక్కల సమస్య కాదు; యూనివర్సిటీ ఆర్థిక పరిపాలనలో తీవ్ర పారదర్శకత లోపానికి సంకేతం. ఉత్తర్వులు ఎప్పుడు జారీ అయ్యాయి? డబ్బులు ఎప్పుడు చెల్లించారు ఎవరు ఆమోదించారు అనే మూడు ప్రశ్నలకు అధికారులు బహిరంగంగా సమాధానం చెప్పాలి" అని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై వైస్-ఛాన్సలర్, రిజిస్ట్రార్, ఫైనాన్స్ అధికారి, ఆడిట్ విభాగం సమగ్ర వివరణ ఇవ్వాలని, అవసరమైతే బాహ్య ఆడిట్ నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని అధికారులు భావిస్తే, సంబంధిత బిల్లులు, ఆమోద ఉత్తర్వులు, చెల్లింపు వివరాలు, తనిఖీ నివేదికలను బహిర్గతం చేసి అనుమానాలకు తెరదించాలని విద్యార్థి సంఘాలు సవాల్ చేస్తున్నాయి. కేయూ హాస్టల్ ఖజానా విద్యార్థుల సొమ్ముతో నడుస్తోంది. దానికి ఎవరు జవాబుదారులు ఉత్తర్వులు ఆగస్టులో వస్తే ఫిబ్రవరి నుంచే భత్యం ఎలా --- ఇదే ఇప్పుడు కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రధాన ప్రశ్నగా మారింది.

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నారాయణకు ఆర్థిక సహాయం

తొర్రూర్, విశాలజ్యోతి: వెలికట్ట గ్రామంలో హరిజన కాలనీకి చెందిన బండ నారాయణ గత కొద్ది రోజులుగా రెండు కిడ్నీలు డ్యామేజ్ అవడంతో విషయం తెలుసుకున్న మాలోత్ సునీత -రాజేందర్ నారాయణకు డయాలసిస్ ఖర్చులకు వారి కుటుంబానికి రూ.10000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ ఆదేశాల మేరకు అందజేత అందజేయడం జరిగింది అదేవిధంగా వెలికట్ట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలని ప్రమర్శించి ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాలోత్ సునీత రాజేందర్ బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, కష్టకాలంలో వారికి తోడుగా నిలవడం తమ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ అల్లం నేని అనిల్ రావు, వార్డు సభ్యులు వీరమనేని రమేష్ రావు, సోమరపు ఐలయ్య, భోగ కమలాకర్, బంధు వెంకన్న, మాలోత్ యాకుబ్, రవి, రాములు, యాకయ్య, వడ్లకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శబరిమల పాదయాత్రకు బయల్దేరిన గురుస్వాములు

- శుభాకాంక్షలు తెలిపిన ఈర్ల రాజు ముదిరాజ్

పటాన్చెరు అక్టోబర్ 23.(విశాలజ్యోతి) బీరంగూడ డివిజన్ కిష్టారెడ్డిపేట్ గ్రామం నుండి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి 1300 కి.మీ పాదయాత్రకు బయల్దేరుతున్న గురుస్వాములకు బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. తెల్లాపూర్ కు చెందిన శ్రీకాంత్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో, మాజీ ఎంపీపీ దండ్ల సునీత సత్యనారాయణ కుమారుడు దండ్ల కిరణ్ కుమార్ గురుస్వామి తన 15 మంది మిత్రులతో కలిసి ఈ పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర అక్టోబర్ 24, శనివారం ఉదయం 8 గంటలకు కిష్టారెడ్డిపేట్ దుర్గామాత ఆలయం నుండి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా గురుస్వాములు ఈర్ల రాజు ముదిరాజ్ ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈర్ల రాజు మాట్లాడుతూ – "అయ్యప్ప మాలధారణ అనేది కేవలం ఆచారం కాదు, అది భక్తి, నియమనిష్ఠలు, ఆత్మనిగ్రహాన్ని నేర్పే పవిత్ర మార్గం. చిన్న వయసులోనే 1300 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు సంకల్పించడం గొప్ప విషయం. సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావడం అభినందనీయం" అని అన్నారు. పాదయాత్రలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ స్వామి ఆశీస్సులు ఉండాలని, యాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతం కావాలని కోరుకున్నారు.

నందిపేట్ గ్రంథాలయ స్థల మార్పునకు ప్రజల విజ్ఞప్తి

- భవన నిర్మాణానికి అభ్యంతరం లేదు.. స్థల ఎంపికపైనే అభ్యంతరాలు
- బస్టాండ్ సమీపంలో రద్దీ వాతావరణం.. విద్యార్థుల ఏకాగ్రతకు ఆటంకాలుంటాయంటున్న స్థానికులు
- గతంలోనే రూ.50 లక్షల నిధులు మంజూరు.. ప్రభుత్వ స్థలంలోనే నిర్మాణం చేపట్టాలని సూచన

నందిపేట్, అక్టోబర్ 23: నాలుగు దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతున్న నందిపేట్ గ్రామ గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్న స్థానికులు, అయితే అందుకు ఎంపిక చేసిన స్థలంపై పునరాలోచన చేయాలని కోరుతు న్నారు. గ్రంథాలయ నిర్మాణం అవసరమే అయినప్పటికీ, విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రశాంతంగా చదువుకునేందుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు చదువుకు అనుకూలమైన వాతావరణం ఉండేలా స్థలాన్ని ఖరారు చేయాలని సూచిస్తున్నారు.

రద్దీ ప్రాంతంలో నిర్మాణంపై ఆందోళన

ప్రస్తుతం గ్రంథాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం పరిసరాలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భవనం ముందు మాంసం విక్రయ దుకాణాలు, పక్కనే మద్యం విక్రయ కేంద్రం, మరోవైపు ఆర్టీసీ డిపోకు సంబంధించిన ఖాళీ స్థలం, వెనుకవైపు చేపల మార్కెట్, మరు గుదొడ్లు ఉండటంతో రద్దీ, శబ్దాలు, జన సంచారం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బస్టాండ్ సమీపంలో ఉండటం వల్ల వాహనాల రాకపోకలు, ప్రయాణికుల సందడి కూడా చదువుకునే విద్యార్థుల ఏకాగ్రతకు ఆటంకం కలిగించవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు నిశ్శబ్ద వాతావరణం ఎంతో అవసరమని, మహిళా విద్యార్థులు సైతం సౌకర్యవంతంగా వచ్చి చదువుకునేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. బస్టాండ్‌కు సమీపంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యం కలిగినా, పరిసరాల్లోని రద్దీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. గతంలోనే రూ.50 లక్షల నిధుల మంజూరుగ్రంథాలయ భవన నిర్మాణం ఇప్పుడే తెరపైకి వచ్చిన అంశం కాదని, గత ప్రభుత్వ హయాంలో అప్పటి చైర్మన్ రాజేశ్వర్ ప్రత్యేక చొరవతో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పట్లోనే నిర్మాణానికి అవసరమైన స్థలంపై పరిశీలన జరిగిందని, ప్రభుత్వ స్థలమైన వ్యాన్ల అడ్డా ప్రాంతంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్మాణం చేపట్టే అవకాశాన్ని పరిశీలించినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించే భవనానికి ప్రభుత్వ స్థలాన్నే వినియోగించాలనే అభిప్రాయాన్ని కొందరు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వికాసం కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయంలో స్థల వివాదాలు తలెత్తి గ్రామంలో విభేదాలకు దారితీయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరు తున్నారు. అయితే, గతంలో పరిశీలించిన స్థలం, ప్రస్తుతం ఎంపిక చేసిన స్థలానికి సంబంధించిన అధికారిక వివరాలు స్పష్టమైతేనే ఈ అంశంపై పూర్తి అవగాహనకు అవకాశం ఉంటుంది. అందరికీ అందుబాటులో.. ప్రశాంత వాతావరణంలో నిర్మించాలి గ్రంథాలయం నిర్మాణాన్ని అడ్డు కోవడం తమ ఉద్దేశం కాదని, విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సరైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలన్నదే తమ అభిమతమని స్థల మార్పును కోరుతున్నవారు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో అందు బాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను పరిశీలించి, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రంథాలయం అనేది కేవలం పుస్తకాలు భద్రపరిచే భవనం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే విజ్ఞాన కేంద్రం అని వారు పేర్కొంటున్నారు. అందువల్ల స్థల ఎంపికలో రవాణా సౌకర్యం, భద్రత, పరిసరాల పరిశుభ్రత, ప్రశాంతత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

నిర్మాణానికి ముందే పునఃపరిశీలన చేయాలి

నందిపేట్ గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదిత స్థలాన్ని మరోసారి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాలను పరిశీలించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ చేపడుతున్న గ్రంథాలయ నిర్మాణం భవిష్యత్తులో వివాదాలకు కేంద్రంగా కాకుండా, విద్యార్థుల అభ్యున్నతికి నిలయంగా మారాలంటే స్థల ఎంపికపై సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. గ్రంథాలయం నిర్మించాలన్న లక్ష్యం ఎంత ముఖ్యమో..దానికి సరైన స్థలాన్ని ఎంపిక చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల అభ్యంతరాలు, ప్రత్యామ్నాయ స్థలాల లభ్యత, విద్యార్థుల అవ సరాలను పరిగణనలోకి తీసుకొని అధికా రులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

త్రివిధ దళాల సమన్వయంలో సీడీఎస్ కీలక భూమిక

- నితిన్ ఎ. గోఖలే

పటాన్చెరు, అక్టోబర్ 23:(విశాలజ్యోతి) భారతదేశ రక్షణ రంగంలో త్రివిధ దళాలను సమన్వయం చేయడంలో, ప్రభుత్వానికి సైనిక సలహాలు ఇవ్వడంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రముఖ రక్షణ నిపుణులు, భారత్ శక్తి గ్రూపు వ్యవస్థాపకుడు నితిన్ ఎ. గోఖలే అన్నారు. గీతం డీమ్డ్ యూనివర్సిటీ, హైదరాబాద్ లోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీ పీ) లో శుక్రవారం 'రేపటి యుద్ధాలకు సన్నద్ధం: త్రివిధ దళాల నుంచి ఒకే పోరాట శక్తిగా' అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా గోఖలే మాట్లాడుతూ – లార్డ్ ఇస్మే ప్రతిపాదించిన మూడు అంచెల రక్షణ నిర్మాణం నుండి, కార్గిల్ సమీక్షా కమిటీ సిఫార్సులు, 2019 లో ప్రధాని మోదీ సీడీఎస్ ప్రకటన, 2020 జనవరి 1న మొదటి సీడీఎస్ నియామకం వరకు రక్షణ సంస్కరణల పరిణామక్రమాన్ని వివరించారు. సీడీఎస్ బాధ్యతలు, థియేటరైజేషన్, ఆధునీకరణ, స్వదేశీకరణ, మహిళల భాగస్వామ్యం, ఆపరేషన్ సింధూర్ ప్రభావం వంటి అంశాలను విశదీకరించారు. భవిష్యత్తులో సమీకృత థియేటర్ కమాండ్ల ఏర్పాటు, 2047 నాటికి సాయుధ దళాలకు దీర్ఘకాలిక విజన్ అవసరమని నొక్కి చెప్పారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కేఎస్ పీ పీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారత మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.